ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7 తమిళనాడు TAMILNADU
గురువారం 25 సెప్టెంబరు 2025

అడయార్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు 'కలైమామణి' పురస్కారాలకు కదలిక వచ్చింది. పలు తర్జనభర్జనల అనంతరం ప్రతి యేటా టీవీ, సినిమా రంగాల కళాకారులకు అందజేసే 'కలైమామణి' అవార్డులను బుధవారం తమిళనాడు రాష్ట్ర సంగీత సాహిత్య నాటక అకాడమీ (తమిళనాడు ఇయల్ ఇసై నాడగ మండ్రం) ప్రకటించింది. 2021, 2022, 2023 సంవత్సరాలకుగాను కలైమామణి, భారతీయార్, ఎంఎస్ సుబ్బులక్ష్మి, బాలసరస్వతి పేర్లతో ఇచ్చే అవార్డులకు ఎంపికైన వారి పేర్లను వెల్లడించింది. ఈ అవార్డులను వచ్చే నెలలో ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ప్రదానం చేస్తారు. ఈ అకాడమీ ప్రతి యేటా అర్హులైన వారిని అవార్డులకు ఎంపిక చేసి ప్రదానం చేయడం ఆనవాయితీ. అయితే, గత మూడేళ్ళుగా ఈ అవార్డులను ప్రకటించలేదు. ఇదే విషయంపై సినీ ప్రముఖులు సీఎం స్టాలిన్‌ను కలిసి అవార్డులను ప్రకటించాలని పలుమార్లు విన్నవించారు. ఈ నేపథ్యంలో గత మూడేళ్ళకు సంబంధించిన అవార్డులన్నింటీ ప్రభుత్వం ప్రకటించింది. 'కలైమామణి' అవార్డు గ్రహీతలకు 3 సవర్ల బంగారు పతకం, జ్ఞాపిక అందజేస్తారు. అలాగే, భారతీయార్, ఎంఎస్ సుబ్బులక్ష్మి, బాలసరస్వతి స్మారకార్థం ప్రత్యేక అవార్డులను ప్రదానం చేస్తారు. భారతీయార్ అవార్డు (సాహిత్యం)ను న.మురుగేశ పాండియన్, ఎంఎస్ సుబ్బులక్ష్మి అవార్డు (సంగీతం)ను పద్మభూషణ్ డాక్టర్ కేజే ఏసుదాస్, బాలసరస్వతి అవార్డు (నాటకం)ను పద్మశ్రీ ముత్తుకన్నమ్మాళ్‌లకు ప్రదానం చేయనున్నారు. వీరికి లక్ష రూపాయల నగదు, 3 సవర్ల బంగారు పతకాన్ని బహూకరిస్తారు. అదేవిధంగా సంగీతం, సాహిత్య రంగాలకు చెందిన పలువురు ప్రముఖులకు కూడా కలైమామణి అవార్డును ప్రకటించారు. ఈ అవార్డులకు ఎంపికైన వారిలో చిత్రపరిశ్రమకు చెందిన వారి వివరాలు....


ఏసుదాస్


సాయిపల్లవి


అనిరుధ్ రవిచందర్


ఎస్‌జే సూర్య

మూడేళ్లకు 'కలైమామణి' అవార్డులు

ప్రకటించిన సర్కారు
ఏసుదాస్‌కు ఎంఎస్ సుబ్బులక్ష్మి ప్రత్యేక అవార్డు

■ 2021 సంవత్సరానికి...
- హీరోయిన్ సాయిపల్లవి (సినిమా)
- ఎస్‌జే సూర్య (సినిమా)
- పూచ్చి మురుగన్ (నాటకం)
- లింగుస్వామి (సినీ దర్శకుడు)
- సూపర్ సుబ్బరాయన్ (స్టంట్ మాస్టర్)
- బీకే కమలేష్ (బుల్లితెర నటుడు)
- ఎంపి విశ్వనాథన్ (సంగీత, నాటక నటుడు)

■ 2022 సంవత్సరానికి...
- విక్రమ్ ప్రభు (సినిమా)
- జయ వీసీ గుహనాథన్ (సినీ నటి)
- వివేకా (సినీ గేయరచయిత)
- డైమండ్ బాబు (సినీ పీఆర్వో)
- టి.లక్ష్మీనాథన్ (సినీ ఫొటోగ్రాఫర్)
- గాయత్రి (బుల్లితెర నటి)

■ 2023 సంవత్సరానికి...
- అనిరుధ్ (సినీ సంగీత దర్శకుడు)
- శ్వేతా మోహన్ (నేపథ్య గాయని)
- సంతోష్ కుమార్ (కొరియోగ్రాఫర్)
- నిఖిల్ మురుగన్ (సినీ పీఆర్వో)
- ఉమా శంకర్ (టీవీ యాంకర్).

బొందిలో ప్రాణమున్నంతవరకూ రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడతా

ముఖ్యమంత్రి స్టాలిన్


అనితా అఛీవర్స్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన బొందిలో ప్రాణమున్నంత వరకూ రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతూనే ఉంటానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి దివంగత నేత కరుణానిధిని ఆదర్శంగా తీసుకుని శ్రమించడమే కాకుండా, అందరికీ అన్ని సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. బుధవారం ఉదయం తన నియోజకవర్గం కొళత్తూరులో ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పెరంబూరు పేపర్‌మిల్స్ రోడ్డులో రూ.8.20 కోట్లతో మురసొలి మారన్ ఉద్యానవనం పునర్నిర్మాణ పనులకు, కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.13.95 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొళత్తూరు నియోజకవర్గంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.8.65 కోట్లతో నిర్మించిన రెండు పాఠశాల భవనాలు, పునర్నించిన ఫుట్‌బాల్ మైదానాన్ని ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత జవహర్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు సహాయాలు అందజేశారు. చివరగా పెరియార్ నగర్ క్రీడామైదానంలో అనితా అఛీవర్స్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 126 మంది విద్యార్థినీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, సర్టిఫికెట్లు, నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన సొంత నియోజకవర్గం కొళత్తూరులో అడుగుపెట్టగానే తనలో సంతోషం ఏర్పడుతుందని, ఈ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఆనందిస్తున్నానని చెప్పారు. రెండు గంటలపాటు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని అనితా అఛీవర్స్ అకాడమీలో విద్యార్థులందరినీ చూడగానే తనలో మరింత చురుకుదనం ఆవహిస్తోందని చెప్పారు. ఈ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్నవారంతా తమ పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాలలో మరింతగా ప్రతిభాపాటవాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పోటీ యుగంలో అంతర్జాలంలో లభించన సమాచారం అంటూ ఏదీ లేదని, అన్వేషిస్తే అన్ని వివరాలు అర్థమవుతాయన్నారు. ఆన్‌లైన్ కోర్సులపై కూడా యువత దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో మంత్రి వీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి, రాజ్యసభ సభ్యుడు గిరిరాజన్, ఎమ్మెల్యేలు తాయగం కవి, జోసెఫ్‌సామువేల్, వెట్రి అళగన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, డీఎంకే స్థానిక నాయకులు నాగరాజన్, ఐసీఎఫ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

6న రాష్ట్రానికి జేపీ నడ్డా

● నయినార్ నాగేంద్రన్



పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వచ్చే నెల 6వ తేది రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నయినార్ నాగేంద్రన్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ... ఎంజీఆర్ కళాశాలలో అక్టోబర్ 6వ తేది జరుగనున్న వేడుకల్లో పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా పాల్గొంటారని తెలిపారు. అక్టోబరు 12వ తేది బీజేపీ ఆధ్వర్యంలో మదురై నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నామని తెలిపారు ఈ సందర్భంగా విలేఖరులు అడిగిన ప్రశ్నలకు నాగేంద్రన్ సమాధానమిస్తూ... టీటీవీ దినకరన్‌తో సమావేశం స్నేహపూర్వితమైనదని అన్నామలై ఇప్పటికే ప్రకటించారన్నారు. ఇదిలా వుండగా నయినార్ నాగేంద్రన్ ఇటీవల ఢిల్లీలో జేపీ నడ్డాను కలుసుకున్న సమయంలో ఓపీఎస్, టీటీవీ దినకరన్ గురించి ఈపీఎస్‌తో మాట్లాడాలని సూచించినట్లు తెలిసింది.

అన్నాడీఎంకే కార్యాలయం సహా
పది ప్రాంతాలకు బాంబు బెదిరింపులు

● బాంబ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం సహా పది ప్రాంతాలకు బాంబు బెదిరింపులు రావటంతో పోలీసు అధికారులు, బాంబ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు చేపట్టారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో బాంబు పేలనున్నట్లు పోలీసు కంట్రోల్ రూమ్‌కు మంగళవారం రాత్రి ఈమెయిల్ వచ్చింది. దీంతో పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌తో హుటాహుటిన అక్కడికి చేరుకుని ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదరింపు అని నిర్ధారణ అయ్యింది. ఇదే విధంగా సెయింట్ జార్జికోటలోని నేవీ న్యాంటీన్, పురుషవాక్కంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, తేనాంపేటలోని కంట్రోల్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయం, మరో ఆరు ప్రాంతాల్లో బాంబులు పేలనున్నట్లు ఈమెయిల్ సందేశాలు వచ్చాయి. పోలీసులు ఆ ప్రాంతాలకు కూడా వెళ్ళి బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు జరిపారు. చివరకు అవి కూడా ఉత్తుత్తి బాంబు బెదిరింపులేనని నిర్ధారించారు. ఇదిలా ఉండగా ఈ ఈమెయిల్ బాంబు బెదిరింపులన్నీ డీపీఐ తదితర రాజకీయ పార్టీల నేతలు, ఎంపీల పేర్లతో వచ్చాయని పోలీసు ఉన్నతాధికారులు చెప్పారు. గత నాలుగు రోజులుగా నగరంలో పలు ప్రాంతాలకు ఇలాంటి బాంబు బెదిరింపు ఈమెయిల్ సందేశాలే వచ్చాయి. పోలీసులు సకాలంలో వెళ్ళి తనిఖీలు జరిపి అవనీ ఉత్తుత్తివేనని తేల్చిన విషయం తెలిసిందే.

సీబీఐకి ఆమ్‌స్ట్రాంగ్
హత్య కేసు

మద్రాస్ హైకోర్టు తీర్పు

ఆరు నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశం



పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు విచారణను సీబీఐకి బదిలీ చేస్తూ మద్రాసు హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ గత ఏడాది జూలై 5వ తేది తన ఇంటి ముందే దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటివరకు 27 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసును సెంబియం పోలీసులు సరిగ్గా విచారణ చేపట్టలేదని, ఈ కేసు విచారణ సీబీఐకి బదిలీ చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, ఆమ్‌స్ట్రాంగ్ సోదరుడు కినోస్ ఆమ్‌స్ట్రాంగ్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై ఇటీవల న్యాయమూర్తి వేల్‌మురుగన్ విచారణ చేపట్టారు. పోలీసుశాఖ తరపున అఫిడవిట్ దాఖలుచేశారు. పోలీసుశాఖ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తోందని, ఆమ్‌స్ట్రాంగ్ భార్య కూడా పోలీసుల విచారణ సంతృప్తికరంగా ఉందని తెలిపినట్లు గుర్తు చేసింది. ఇది రాజకీయ హత్య కాదని, ఈ కేసు విచారణ ముగిసి చార్జ్‌షీటు దాఖలు చేసినందున, ఈ పిటిషన్ తోసిపుచ్చాలని పోలీసుశాఖ అభ్యర్థించింది. అరెస్టయిన వారి వాంగ్మూలం ఆధారంగా పోలీసుశాఖ అత్యవసరంగా చార్జ్‌షీటు దాఖలు చేసిందని పిటిషనర్ తరపున హాజరైన న్యాయవాది పేర్కొన్నారు. ఆమ్‌స్ట్రాంగ్ భార్య సాక్ష్యం ఆధారంగా, కాంగ్రెస్ నాయకుడు సెల్వపెరుందగైను విచారించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇరుతరపు వాదనలు ముగియడంతో న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో పలు అనుమానాలున్నాయని, అందువల్ల మెరుగైన దర్యాప్తు కోసం కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని వివరాలు, పత్రాలు పోలీసుశాఖ వెంటనే సీబీఐకి అప్పగించాలని ఆదేశించారు. ఆరు నెలల్లో కేసు దర్యాప్తు ముగించి, చార్జ్‌షీటు దాఖలు చేయాలని సీబీఐకి తేల్చి చెప్పారు.


అన్నాడీఎంకే ఎవరికీ తలవంచదు

● ఎడప్పాడి పళనిస్వామి


వాజ్‌పేయితో కరుణానిధి, మురసొలిమారన్ ఉన్న ఫొటో చూపిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఎవరికీ తలవంచదని, మిత్రపక్షాలను బానిసలుగా చూడటం డీఎంకే నైజమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వ్యాఖ్యానించారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంతో నియోజకవర్గాల వారీగా ఈపీఎస్ చేస్తున్న ప్రచారయాత్ర బుధవారం నీలగిరి జిల్లాలోని గూడలూరు నియోజకవర్గానికి చేరుకుంది. దేశంలోనే ఉన్నత విద్యలో తమిళనాడును అగ్రస్థానంలో నిలిపిన ఘనత అన్నాడీఎంకే ప్రభుత్వానిదేనని, అందుకే ఆ రంగానికి అధిక నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా కేంద్రప్రభుత్వంతో సన్నిహితంగా మెలిగి రాష్ట్రానికి రావాల్సిన నిధులను, పథకాలను ఏ మాత్రం జాప్యం లేకుండా పొందడంతో పాటు కేంద్రాన్ని మెప్పించి ప్రభుత్వ వైద్యకళాశాలలను కూడా తీసుకొచ్చింది అన్నాడీఎంకే ప్రభుత్వమేనని, అయితే ఈ డీఎంకే హయాంలో ఇలాంటి ఏ పథకాన్నికూడా తీసుకురాలేపోయారని విమర్శించారు. దేశంలో అధికంగా అప్పులు చేయడంలో తమిళనాడు అదర్శవంతంగా ఉందని, అవినీతి, కమీషన్, కరప్షన్‌లో కూడా డీఎంకేకు సాటి ఎవరూలేరని ఈపీఎస్ ధ్వజమెత్తారు. 1999లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ కూటమిలో డీఎంకే చేరిందని, ఆ ఎన్నికల్లో గెలవడం ద్వారా అప్పటి ప్రధాని వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వంలో డీఎంకే తరుపున మురసొలిమారన్ కేంద్రమంత్రిగా పని చేశారని, అప్పుడు బీజేపీని మంచిపార్టీగా డీఎంకే అభివర్ణించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకున్న బీజేపీని మతవాద పార్టీగా డీఎంకే విమర్శించడం సరికాదన్నారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశంలో ఎమర్జెన్సీ చట్టం అమలుకు వచ్చిందని, అప్పుడు డీఎంకే నేతలతో పాటు స్టాలిన్‌ను కూడా జైలుకెళ్లారని, అయితే తమను జైలు పాలు చేసిన కాంగ్రెస్‌తో ఎందుకు పొత్తు కుదుర్చుకున్నారో ఆ భగవంతునికే ఎరుకన్నారు. డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో సీబీఐ తనిఖీలతర్వాతే కాంగ్రెస్‌తో డీఎంకే పొత్తు కుదుర్చుకుందని, ఈ వాస్తవాన్ని పక్కనబెట్టి అన్నాడీఎంకే బీజేపీకి బానిసైందని విమర్శించడం న్యాయంకాదన్నారు. నీలగిరి జిల్లాలో సొంతిల్లు నిర్మించుకోవాలనుకున్నవారి నుంచి వెయ్యి చదరపు అడుగుల ఇంటిప్లాను గుర్తింపుకు ఈ ప్రభుత్వం రూ.74వేలు వసూలు చేస్తోందని, అలాగే అన్ని రంగాల్లో పన్నులు పెంచిందని, అధికంగా అప్పులు పొంది ఓటేసి గెలిపించిన ప్రజలపై ఆర్థిక భారం మోపిన డీఎంకే ప్రభుత్వాన్ని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని ప్రజానీకాన్ని ఈపీఎస్ విజ్ఞప్తి చేశారు.

అనారోగ్యంతో రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి మృతి


బీలా వెంకటేషన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి బీలా వెంకటేషన్(54) బుధవారం రాత్రి మృతి చెందారు. కరోనా సంక్షోభ సమయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసి మంచి పేరు సంపాదించుకున్నారు. గత రెండు నెలలుగా ఆమె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చికిత్స ఫలించక మృతి చెందారు. 1997 బ్యాచ్‌కు చెందిన బీలా వెంకటేషన్ మద్రాసు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివారు. గతంలో ఆమె వాణిజ్య పన్నుల శాఖలోనూ పనిచేశారు.

అభ్యర్థుల ఎంపికపై
స్టాలిన్‌దే తుది నిర్ణయం

● డీఎంకే ప్రిసీడియం కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి

పుదుచ్చేరి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను ముఖ్యమంత్రి స్టాలిన్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎంపిక చేస్తారని డీఎంకే ప్రిసీడియం కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి పేర్కొన్నారు. పుదుచ్చేరి కదిర్‌గామం నియోజకవర్గంలో డీఎంకే ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహం, గ్రంథాలయం, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం బుధవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి డీఎంకే నాయకులు, ఎమ్మెల్యే శివ, తంగవేలు, వడివేల్, తమిళవానన్‌తో కలిసి ఆర్‌ఎస్ భారతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనమీడియాతో మాట్లాడుతూ, తమిళనాడులో ఏర్పాటు చేసిన కూటమి పుదుచ్చేరికి కూడా వర్తిస్తుందన్నారు. 'ఏకతాటిపై తమిళనాడు' పేరుతో డీఎంకే మెంబర్‌షిప్ డ్రైవ్‌ను సీఎం స్టాలిన్ ప్రారంభించారని, ఇప్పటివరకు 2.70కోట్లమంది సభ్యులుగా చేరినట్లు ఆయన వివరించారు. వచ్చేవారంలో పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పుదుచ్చేరిలోని 30, తమిళనాడులోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి తరుపున నియోజకవర్గాల విభజన, అభ్యర్థులను కూటమి అగ్రనేతలైన స్టాలిన్, రాహుల్‌గాంధీ ఎంపికచేస్తారన్నారు.


కరుణానిధి విగ్రహం వద్ద పుదుచ్చేరి డీఎంకే ప్రిసీడియం కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి తదితరులు


ముహూర్త రాట వేస్తున్న శివాచార్యులు, అధికారులు

తిరువణ్ణామలైలో కార్తీక దీపోత్సవాలకు శ్రీకారం

అట్టహాసంగా ముహూర్తపు రాట ఉత్సవం

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవాలకు బుధవారం ఉదయం ముహూర్తపు రాట కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్తీక దీపోత్సవాలు నవంబర్ 21 నుంచి డిసెంబర్ 7వరకు జరుగనున్నాయి. ఈ ఉత్సవాల ముందస్తు ఏర్పాట్లలో భాగంగా బుధవారం ఉదయం ముహూర్తపు రాట కార్యక్రమం ప్రారంభమైంది. వేకువజాము సంబంధ వినాయకుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆ తర్వాత పందిటి గుంజకు అభిషేక ఆరాధనలు చేసి, పంచమూర్తుల రథాల ముందు పందిడి గుంజకు పూజలు జరిపిన మీదట రాజగోపురం ముందు శివాచార్యులు పీటీ శంకర్ నాయకత్వంలో ముహూర్తపు స్తంభ స్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దర్పంగరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి రామ్‌ప్రదీపన్, గ్రామీణాభివృద్ధి ప్రణాళిక సంచాలకులు మణి, అరుణాచలేశ్వరాలయం తక్కర్ మీనాక్షి సుందరం, డిప్యూటీ కమిషనర్ భరణీధరన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార ధ్వని

నేడు పల్లావరంలో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరం ఆఫీసర్స్ లైన్‌లో ఉన్న పల్లావరం నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. పల్లావరం, షోలింగనల్లూర్, వాటి చుట్టుపక్కల ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు పాల్గొని విద్యుత్‌కు సంబంధించిన సమస్యలపై పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

మినుములు, పెసలకు కనీస మద్దతు ధర

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మినుములు, పచ్చ పెసలకు కనీస మద్దతు ధర నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కిలో పచ్చ పెసలుకు రూ.87.68, క్వింటాలుకు రూ.8,768 కనీస మద్దతు ధరగా నిర్ణయించింది. అలాగే, మినుములు కిలో రూ.78, క్వింటాలు రూ.7,800 మద్దతు ధర నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం జీవోలో తెలియజేసింది.

తూత్తుకుడి ఎస్పీ ఎన్ఐఏకు బదిలీ

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి ఎస్పీ ఆల్బర్ట్ జాన్, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు కేంద్ర హోం మంతిత్వ శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో... జాతీయ దర్యాప్తు సంస్థలో ఎస్పీ ఖాళీలు భర్తీచేయనున్నామని, ఆ ప్రకారం తూత్తుకుడి ఎస్పీ ఆల్బర్ట్ జాన్ డిప్యుటేషన్ ప్రాతిపదికన ఎంపిక చేశామన్నారు. ఈ కారణంగా ఆయనను తూత్తుకుడి ఎస్పీ పదవి నుంచి రిలీవ్ చేయాలని లేఖలో పేర్కొన్నారు.

28న 'ఉగ్గుపాల నుండే..' పుస్తక పరిచయ సభ

చెన్నై,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): 'జనని' సాంఘిక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 28న పేరూ రు బాలసుబ్రమణ్యం రచించిన 'ఉగ్గుపాల నుండే...' పుస్తక పరిచయ సభ జరుగనుంది. మైలాపూర్‌లోని పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో ఆదివారం ఉద యం 10గంటలకు నిడమర్తి వసుంధరాదేవి ప్రార్థనా గీతంతో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి జనని ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్ స్వాగతం పలుకనుండగా, జనని అధ్యక్షురాలు డాక్టర్ నిర్మలా పళనివేలు అధ్యక్షత వహించనున్నారు. స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా, మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు విశిష్ట అతిథిగా, అరసం తిరుపతి జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి ఆత్మీయ అతిథిగా హాజరు కానున్నారు. అరసం తిరుపతి జిల్లా కార్యదర్శి డాక్టర్ నెమిలేటి కిట్టన్న పుస్తక సమీక్ష చేయనున్నారు. జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య వందన సమర్పణతో కార్యక్రమం ముగియనుంది.

14 నుంచి దూరవిద్య పరీక్షలు

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్స్, దూరవిద్య, వృత్తి విద్యా కోర్సులు అందిస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరి ప్రయోజనం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో, 10, 12వ తరగతుల పబ్లిక్ పరీక్షల టైంటేబుల్ విడుదలైంది. అక్టోబరు 14 నుంచి 18వ తేది వరకు పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులు nios.ac.in అనే వెబ్‌సైట్ ద్వారా పరీక్షల షెడ్యూల్ తెలుసుకోవచ్చు. పరీక్షలకు కొద్దిరోజుల ముందుగా హాల్ టిక్కెట్లు విడుదల చేస్తామని, పరీక్షలు పూర్తయిన 7 వారాల్లో ఫలితాలు ప్రకటిస్తామని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

గెస్ట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ , సైన్స్ కళాశాలల్లో 881 గౌరవ ప్రొఫెసర్లను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీచేయనున్నట్లు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... 2025-26వ విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో 15వేలకు పైగా అదనపు భర్తీ కేటాయించి భర్తీచేశామని తెలిపారు. అలాగే, పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం కొత్తగా 15 డిగ్రీ కళాశాలలు ప్రారంభించామన్నారు. ఈ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులకు శాశ్వత ప్రాతిపదికన భర్తీచేసేందుకు జాప్యం జరుగుతుండడంతో, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సూచనల మేరకు, ఇప్పటికే 574 గౌరవ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేశామన్నారు. ఇవి మినహా మరో 881 గౌరవ ప్రొఫెసర్ల పోస్టులు భర్తీచేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బుధవారం నుంచి www.tngasa.org అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని మంత్రి చెళియన్ తెలిపారు.

హోమియో వైద్య కోర్సుల దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత వైద్యం, హోమియోపతి డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించారు. ఈ మేరకు భారత వైద్య, హోమియోపతి శాఖ కమిషనర్ విడుదల చేసిన ప్రకటనలో... 2025-26 విద్యా సంవత్సరంలో చెన్నై, పాళయంకోటలో ఉన్న ప్రభుత్వ ఆయుష్ ఉప వైద్య కళాశాలల్లో ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ జరుగుతుందన్నారు. విద్యార్థులు www.tnhealth.tn.gov.in, www.tnayush-selection.org అనే వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు స్వీకరణ జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు పూర్తిగా చదివిన తర్వాత, అందులోని వివరాలు నమోదుచేయాలని, ఒరిజినల్ సర్టిఫికేట్లను PDF/JPEG ఫార్మెట్‌లో నమోదుచేయాలన్నారు. విద్యా ఫీజు కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. దరఖాస్తు స్వీకరణ ఈ నెల 23వ తేది సాయంత్రం 5 గంటల్లోపు ముగియనున్న నేపథ్యంలో, అక్టోబరు 6వ తేది వరకు పొడిగించినట్లు, మరిన్ని వివరాలను అరుంబాక్కం అరింజర్ అన్నా భారత వైద్యశాల ప్రాంగణంలోని భారత వైద్యం, హోమియోపతి శాఖ కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ప్రకటనలో తెలిపారు.

11న గ్రామసభలు

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పండుగ కారణంగా, అక్టోబరు 2వ తేదీ జరగాల్సిన గ్రామ సభలు రద్దుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12వేల పంచాయితీలున్నాయి. వీటిలో, గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలతో, గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, మేడే, గాంధీ జయంతి రోజుల్లో గ్రామ సభలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, గాంధీ జయంతి రోజైన అక్టోబరు 2వ తేది గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంది. కానీ అదే రోజున విజయ దశమి కారణంగా ఆ రోజు నిర్వహించాల్సిన గ్రామ సభలు రద్దు చేశారు. దానికి బదులుగా అక్టోబరు 11వ తేది గ్రామ సభలు నిర్వహించాలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది.





పురప్రముఖులతో కలిసి ధర్నాలో పాల్గొన్న చంద్ర చైతన్య రాజు - ధర్నాలో పాల్గొన్న మహిళలు

పాఠ్యాంశంలో ఎట్టయపురం రాజుపై తప్పుడు సమాచారం

● తొలగించాలని కోరుతూ ధర్నా

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్టబొమ్మన్ స్థావరం రహస్య సమాచారాన్ని తెల్లదొరలకు అందించి ఎట్టయపురం రాజు తీరని ద్రోహానికి పాల్పడినట్లు రాష్ట్ర పాఠ్యపుస్తకంలో ఉన్న తప్పుడు సమాచారాన్ని తొలగించాలని కోరుతూ ఎట్టయపురం వాసులు బుధవారం ఉదయం ధర్నాకు దిగారు. తూత్తుకుడి జిల్లా ఎట్టయపురం సంత మైదానంలో జరిగిన ఈ ఆందోళనకు ఎట్టయపురం సంస్థానానికి చెందిన 42వ రాజు, జగవీరముత్తు తంగకుమారరామ వెంకటేశ్వర అయ్యన్ చంద్ర చైతన్య రాజా నాయకత్వం వహించారు. ధర్నాలో స్థానిక ప్రజలు, వ్యాపారులు, మహిళలు సహా సుమారు 600 మంది పాల్గొన్నారు. ఈ విషయమై చైతన్యరాజా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర పాఠశాలల విద్యామండలి ప్రచురించిన 10వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్టబొమ్మన్ ఆచూకీని తెల్లదొరలకుతెలిపి తీరని ద్రోహం చేసినట్లు పేర్కొన్నారని, అది పూర్తిగా అవాస్తవమని, చరిత్రను వక్రీకరించారని ఆరోపించారు. తొలుత తమిళ సినిమా వీరపాండ్య కట్టబొమ్మన్ చిత్రంలో ఈ తప్పుడు సమాచారం ఉందని, ఏదో సినిమానే కదా అని అలుసుగా తీసుకుంటే ప్రస్తుతం తమ సంస్థానంలో రెండుతరాలకు చెందినవారి కీర్తి ప్రతిష్టతలకు ఆ తప్పుడు సమాచారం భంగం కలిగించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పాఠ్యపుస్తకంలో ఎట్టయపురం రాజు గురించిన తప్పుడు సమాచారాన్ని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో గురువారం నిర్వహించనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రకటన మేరకు శిబిరాలు జరిగే ప్రాంతాల వివరాలిలా ఉన్నాయి... 1వ మండలం 10వ వార్డు పూంతోట వీధిలో ఉన్న పూంతోట క్రీడా మైదానం, 4వ మండలం 44వ వార్డు పెరంబూర్ తులసింగం వీధిలోని వివేకానంద విద్యాలయ యూజీ కళాశాల, 5వ మండలం 58వ వార్డు పెరియమేడు నేవల్ ఆస్పత్రి రోడ్డులోని పాత కమ్యూనిటీ హాలు, 6వ మండలం 70వ వార్డు పెరంబూర్ రాజీ వీధిలోని కార్పొరేషన్ కమ్యూనిటీ హాలు, 7వ మండలం 83వ వార్డు కొరట్టూర్ అగ్రహారం అన్నా నగర్ రోడ్డులోని మోహన్ గార్డెన్, 8వ మండలం 108వ వార్డు చెట్‌పెట్ అన్నా ఆడిటోరియం, 9వ మండలం 118వ వార్డు అన్నా సాలైలోని కామధేను కల్యాణ మండలం, 10వ మండలం 140వ వార్డు మాంబళం మేట్టుపాళయం ఎతిరాజ్ నగర్ కోడంబాక్కం రోడ్డులోని వీకేఎం మహల్‌లో శిబిరాలు జరుగనున్నాయి. అలాగే, 11వ మండలం 148వ వార్డు నెర్కుండ్రం ఎన్‌టీ పటేల్ రోడ్డులోని జీఎం మహల్, 12వ మండలం 162 వార్డు తిల్లైగంగా నగర్ 45వ వీధిలోని ఆనంద కల్యాణ మండపం, 13వ మండలం 175వ వార్డు ఆదంబాక్కం లక్ష్మీ హయగ్రీవ నగర్ 3వ క్రాస్ వీధిలోని క్రీడా మైదానం, 14వ మండలం 187వ వార్డు మడిపాక్కం బాలయ గార్డన్ భజన ఆలయ వీధిలోని రుక్మిణి మహల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

తూత్తుకుడిలో రూ.1156 కోట్లతో రిలయన్స్ ఫ్యాక్టరీ

● మంత్రి టీఆర్బీ రాజా

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి సిప్కాట్‌లో రూ.1156 కోట్లతో రిలయన్స్ సంస్థ కొత్త కర్మాగారాన్ని నెలకొల్పనుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో కొత్త కర్మాగారం ద్వారా వచ్చే ఐదేళ్లలో రెండు వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. 60 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటయ్యే ఈ కర్మాగారంలో బిస్కెట్లు, వంటనూనె తదితర వస్తువులను ఉత్పత్తి చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కర్మాగారం ఏర్పాటుకు సంబంధించిన ప్రభుత్వపరంగా అన్ని అనుమతులను మంజూరు చేశామని, త్వరలోనే రిలయెన్స్ సంస్థ అధికారులు స్థలపరిశీలన చేసి ఫ్యాక్టరీ నిర్మిస్తారని ఆయన వివరించారు.

మంత్రి పెరియస్వామికి అస్వస్థత

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఐ.పెరియస్వామి అనారోగ్యం కారణంగా కోయంబత్తూర్ సింగానల్లూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. కడుపు నొప్పితో బాధపడుతున్న ఆయనకు కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాల సమాచారం.

దేవతామూర్తుల వేషధారణలో చిన్నారుల సందడి



ప్యారీస్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక చూలైలోని మహర్షి విద్యామందిర్ చిన్నారులు దేవతామూర్తుల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. నగరంలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 7.30 గంటలకు వేదపారాయణం, అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శూలినీ అలంకారంలో భూతవాహనంపై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. 6.45 గంటలకు మహర్షి విద్యామందిర్ పాఠశాలలో ఎల్‌కేజీ నుండి 8వ తరగతి వరకు చదువుకుంటున్న చిన్నారులు వివిధ దేవతామూర్తుల వేషధారణలో ఆడుతూ, పాడుతూ సందడి చేశారు. రాత్రి 7 నుండి 8 గంటలకు వరకు పి.సబితాగిరి, ఆర్.కృత్తికశ్రీల వీణానాదం శ్రోతలను అలరించింది.

సభలు, ర్యాలీలకు ముందస్తు నగదు వసూలు

● నిబంధనలు రూపొందించేందుకు గడువు

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బహిరంగ సభలు, ర్యాలీలకు అనుమతి కోరుతున్న వారి నుంచి ముందుగా నగదు వసూలుకు సంబంధించిన నియమాల రూపొందించేందుకు మద్రాసు హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అక్టోబరు 16వ తేది వరకు గడువు విధించింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) సభలకు పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తూ నిబంధనలు విధిస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌ను గతంలో విచారించిన మద్రాసు హైకోర్టు, ర్యాలీలు, సభలు నిర్వహించే పార్టీల నుంచి ముందస్తు నగదు పొందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ కేసు మళ్లీ బుధవారం న్యాయమూర్తి జస్టిస్ సతీష్‌కుమార్ విచారించారు. ఆ సమయంలో పోలీసు శాఖ తరఫున... ముందస్తు చెల్లింపు తీసుకోవడానికి చట్టంలో లేదని తెలిపారు. అందుకు అభ్యంతరం తెలిపిన న్యాయమూర్తి... ప్రభుత్వం కోరుకుంటే ఇలా చేయవచ్చు. కానీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రజా ఆస్తులు ధ్వంసం కాని పక్షంలో దానిని తిరిగివ్వవచ్చుకదా? అంటూ పేర్కొన్నారు. అలాగే, టీవీకే ప్రచారానికి అనుమతిచ్చే వ్యవహారంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

కిడ్నాప్‌కు గురైన బాలుడు

● రక్షించిన పోలీసులు



కిడ్నాప్‌కు గురైన మహేష్

వేలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్‌కు గురైన బాలుడిని నాలుగు గంటల్లో పోలీసులు రక్షించారు. గుడియాత్తంకు చెందిన వేణుకు మహేష్ (4) అనే కుమారుడున్నాడు. వేణు కుమారుడిని బుధవారం మధ్యాహ్నం భోజనం కోసం పాఠశాల నుంచి ఇంటికి తీసుకొచ్చాడు. ఇంటి బయట కుమారుడిని దించిన వేణు బైక్ పార్కింగ్ చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు, హఠాత్తుగా బాలుడిని కారులో తీసుకెళ్లేందుకు యత్నించారు. అడ్డుకోబోయిన వేణు కళ్లలో కారం చల్లి, బాలుడితో పరారయ్యారు. వేణు ఫిర్యాదు మేరకు గుడియాత్తం పోలీసులు కేసు నమోదుచేసి బాలుడి కోసం గాలించారు. కారు కర్ణాటక రిజిస్ట్రేషన్ ఉండడంతో, రాష్ట్రాల సరిహద్దుల్లో నిఘా పెంచిన పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో, తిరుపత్తూర్ జిల్లా మాదనూరు సమీపం దేవికాపురం సమీపంలోని వంతెన వద ఉన్న మహేష్‌ను పోలీసులు రక్షించి కిడ్నాప్ చేసిన వ్యక్తుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

గాయత్రీదేవిగా కొల్లాపురియమ్మన్



ప్రత్యేక పూజలో ఆలయ నిర్వాహకులు, భక్తులు

తిరుత్తణి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో వెలసివున్న కొల్లాపురియమ్మన్‌ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా బుధవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తుల కు దర్శనమిచ్చారు. సోమవా రం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న ఈ నవరాత్రి వేడుకల్లో భాగంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం అర్చకులు అమ్మవారికి గాయత్రి అలంకారంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జయకృష్ణన్, ఉభయకర్తలు సతీష్‌కుమార్, సుజాత, హరిరెడ్డి, రాధిక, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

20 బోగీలతో నెల్లై - చెన్నై వందేభారత్

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి - చెన్నై వందేభారత్ రైలు బుధవారం నుండి 20 బోగీలతో నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ వందేభారత్ రైలును 2023 సెప్టెంబర్‌లో ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ రైలులో ప్రయాణించేవారి సంఖ్య రోజురోజుకూ అధికమవుతుండటంతో బోగీల సంఖ్యను 16కు పెంచారు. ఈ నేపథ్యంలో బుధవారం నుండి బోగీల సంఖ్యను 20కి పెంచినట్లు అధికారులు తెలిపారు.

పరస్పరం క్షమాపణలు చెప్పుకోండి

● సీమాన్, విజయలక్ష్మిలకు సుప్రీంకోర్టు హితవు



విజయలక్ష్మి - సీమాన్

ప్యారీస్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పరస్పరం క్షమాపణ చెప్పుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సీమాన్, విజయలక్ష్మిలకు సుప్రీంకోర్టు హితవు పలికింది. నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే)చీఫ్ ఆర్గనైజర్ సీమాన్‌కు వ్యతిరేకంగా నటి విజయలక్ష్మి దాఖలు చేసిన కేసు రద్దుచేయాలని కోరుతూ సీమాన్ తరఫున ఈ నెల 12వ తేదీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గతవారం విచారణ జరిపింది. ఇరు తరుపు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం, సీమాన్ క్షమాపణ కోరుతూ న్యాయస్థానంలో ప్రమాణపత్రం దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసు బుధవారం మళ్లీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నాగరత్న, ఆర్.మహదేవన్ బెంచ్ ముందుకు విచారణకు వచ్చింది. అప్పుడు సీమాన్ దాఖలు చేసిన ప్రమాణపత్రం క్షమాపణ చెప్పే విధంగా లేదని విజయలక్ష్మి తరుపున హాజరైన న్యాయవాది తెలిపారు. దీంతో సీమాన్ విజయలక్ష్మి మధ్య విభేదాలు ఇంకా ఎన్నిరోజు లు కొనసాగుతాయని ప్రశ్నించిన న్యాయస్థానం వారు ఇరువురు పరస్పరం క్షమాపణ చెప్పుకుని సమస్యను పరిష్కరింపజేసుకోవాలంటూ న్యాయమూర్తుల బెంచ్ అభిప్రాయం వ్యక్తంచేసింది. ఈ సారైనా న్యాయస్థానం ఉత్తర్వులను పాటించకపోతే విచారణకు హాజరుకావాల్సివస్తుందని సూ చించిన న్యాయస్థానం ఈ కేసు తదుపరి విచారణను తేదీ ప్రకటించకుండా వాయిదా వేసింది.

ప్రైవేటు కళాశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

● వైద్య విద్యార్థుల ఎంపిక కమిటీ

పెరంబూర్,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వైద్యకళాశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు చేపడతామని వైద్య విద్యార్థుల ఎంపిక కమిటీ హెచ్చరించింది. వైద్య కళాశాలల అడ్మిషన్లకు సంబంధించిన రెండో విడత కౌన్సిలింగ్ ముగిసింది. 2024-25 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం తరగతులు సోమవారం (ఈనెల 22వ తేది)నుంచి ప్రారంభమయ్యాయి. కౌన్సెలింగ్‌లో సీటు పొందిన విద్యార్థులు కళాశాలలకు వస్తున్నారు.విద్యార్థుల వద్ద ప్రైవేటు వైద్యకళాశాలలు నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్నాయని ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో, వైద్య విద్యార్థుల ఎంపిక కమిటీ, అన్ని ప్రైవేటు వైద్యకళాశాల డీన్, ప్రిన్సిపాళ్లకు జారీచేసిన సర్క్యులర్‌లో...నిర్ణయ కమిటీ నిర్ణయించిన విద్యా ఫీజు మాత్రమే వసూలుచేయాలని, అదనంగా డిమాండ్ చేస్తే ఆయా కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా పోరూర్, తిరువేర్కాడు, అయ్యపాక్కం, కొట్టివాక్కం, సెంబియం ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఆ ప్రాంతాల వివరాలిలా ఉన్నాయి...

పోరూర్: మంగళ నగర్, అంబాళ్ నగర్, మౌంట్ పూందమల్లి రోడ్డు, ఆర్‌ఈ నగర్, వన్నియర్ వీధి, తిరువీధిఅమ్మన్ ఆలయ వీధి.

తిరువేర్కాడు: అశోక్ మియోడోస్, సెంచూరియన్ అవెన్యూ, ఆరోఇలియాస్, వడనూంబల్, పెరుమాళగరం.

అయ్యపాక్కం: ఐసిఎఫ్ కాలనీ, చెల్లయమ్మన్ నగర్, గంగై రోడ్డు, కావేరి వీధి, టీఎన్‌హెచ్‌బీ, తిరువేర్కాడు మెయిన్ రోడ్డు, అత్తిపేట, వానగరం రోడ్డు, భారతి మేట్టు వీధి, దినేష్ వీధి, రోజా వీధి, కుప్పం, కేఎస్ఆర్ నగర్, వీజీఎన్ శాంతి నగర్, మేల్ అయనంబాక్కం, చెట్టి వీధి, విజయ నగర్, పచ్చయప్ప నగర్, చెన్నై న్యూ సిటీ, ఈడెన్ అవెన్యూ, కొనరాజు కుప్పం, అగ్రహారం, దేవి నగర్, చిన్నకోలడి, జ్యోతి నగర్, మూర్తి నగర్, ఎళిల్ నగర్, అన్ననూర్.

కొట్టివాక్కం: జర్నలిస్ట్ కాలనీ, లక్ష్మణ పెరుమాళ్ నగర్, రాజా గార్డన్, రాజా కల్యాణి వీధి, కుప్పం రోడ్డు, న్యూ కాలని, కర్పగాంబాళ్ నగర్, శ్రీనివాసపురం, నజీమా అవెన్యూ, ఈసీఆర్ మెయిన్ రోడ్డు, తిరువళ్లువర్ నగర్, కావేరి నగర్, బేవాచ్ బౌల్వార్డ్, వల్లలార్ నగర్, కొట్టివాక్కం కుప్పం, హౌసింగ్ బోర్డు అపార్ట్‌మెంట్స్ (తెండ్రల్ హెచ్ 43 నుంచి హెచ్ 50, ముల్లై హెచ్ 70 నుంచి హెచ్ 75 ఫ్లాట్స్)

సెంబియం: కృష్ణమూర్తి రోడ్డు, జీఎస్టీ రోడ్డు, ఏపీ అరసు వీధి, అన్నాసాలై, కన్నపిరాన్ ఆలయ వీధి, ఎతిరాజ్ రోడ్డు, కేవీటీ హాస్పిటల్, మూలకడై, చంద్రప్రభు కాలని, తనికాచలం నగర్, అన్నై సత్యా నగర్, వెంకటేశ్వర నగర్, పోలీస్ క్వార్టర్స్, ముత్తమిళ్ నగర్ (5,6 బ్లాకులు), మురుగన్ ఆలయ వీధి, వనశక్తి నగర్, సంతోష్ నగర్, బాలాజి వీధి, ఎమరాల్డ్ వీధి, సిల్వర్ వీధి, కెనాల్ రోడ్డు.

వ్యక్తి మృతి కేసులో.. ఎస్ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు జీవిత ఖైదు

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విచారణకు తీసుకెళ్లిన వ్యక్తి మృతికి సంబంధించిన హత్య కేసులో, ఎస్ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు జీవిత ఖైదు విధిస్తూ చెన్నై సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. 2009 మార్చి నెలలో, కుట్టి పళని అనే వ్యక్తి మద్యం మత్తులో గొడవ పడుతున్నాడనే ఫిర్యాదుతో, అతడిని కోట్టూరుపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారణ సమయంలో, పళని వైద్య పరీక్షలకు అంగీకరించలేదంటూ పోలీసులు అతడిపై తీవ్రంగా దాడిచేశారు. అనంతరం అతడిని ఇంటికి పంపించగా, గుండెపోటుతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో, కోట్టూరుపురం పోలీసులకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని కోరుతూ మృతుడి తండ్రి రంగనాథన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన సీఐ ఈ కేసును సైదాపేట అసిస్టెంట్ కమిషనర్‌కు పంపించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో, అదనపు ఫోరెన్సిక్ అసిస్టెంట్, సబ్-డివిజినల్ మేజిస్ట్రేట్ నిర్వహించిన దర్యాప్తులో, పళని మరణానికి పోలీసులు దాడి కారణమని తేలగా ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. సబ్-డివిజినల్ మేజిస్ట్రేట్ సి.రాజేంద్రన్ నివేదిక ఆధారంగా, సంబంధిత పోలీసులపై కేసు నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఆ ప్రకారం, కోట్టూరుపురం పోలీస్ స్టేషన్ క్రైం విభాగం ఎస్ఐ పి.ఆర్ముగం, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.మనోహరన్, పీఎస్ హరిహర సుబ్రమణియన్, విన్సెంట్, ఏలుమలై తదితర ఐదుగురిపై హత్య కేసు నమోదుచేశారు. ఈ కేసు విచారణ అల్లికుప్పంలో ఉన్న 6వ అదనపు సెషన్స్ కోర్టులో జరుగుతోంది. కేసు విచారణ సమయంలో విన్సెంట్, ఏలుమలై మృతిచెందడంతో, వారిపై చార్జీషీటు నమోదుచేయలేదు. ఈ కేసు విచారణ ముగియడంతో పళని మరణానికి పోలీసుల దాడి కారణమని దర్యాప్తులో రుజువైందంటూ న్యాయమూర్తి వి.పాండియరాజన్ కోట్టూరుపురం ఎస్ఐగా వ్యవహరించిన పి.ఆర్ముగం, హెడ్ కానిస్టేబుళ్లు మనోహరన్, హరిహర సుబ్రమణియన్ దోషులుగా ప్రకటించి, ఆ ముగ్గురికి జీవిత ఖైదు, తలా రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఇంట్లో గంజాయి సాగు

● ఆటో డ్రైవర్ అరెస్టు

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో గంజాయి మొక్కలు సాగుచేస్తున్న ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తెన్‌కాశి జిల్లా వేదంపుదూర్ గ్రామానికి చెందిన తిరుమలైకుమార్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తిరుమలైకుమార్ తన ఇంట్లో గంజాయి మొక్కలు సాగుచేస్తున్నట్లు తెన్‌కాశి పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అతడి ఇంట్లో తనిఖీ చేయగా అక్కడ మొక్కలు కనిపించలేదు. దీంతో, తిరుమలైకుమార్ పాత ఇంటి వెనుక వైపు పోలీసులు తనిఖీ చేయగా, అక్కడి తోటలో 10 గంజాయి మొక్కలు సాగుచేస్తుండడం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో... స్నేహితుడి నుంచి గంజాయి విత్తనాలు తీసుకుని పూల కుండీల్లో వేసి పెంచుతున్నట్లు, మొక్కలు పెరిగిన తర్వాత తానే వినియోగించుకోవాలని భావించినట్లు తిరుమలైకుమార్ వాంగ్మూలమిచ్చాడు. అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు, గంజాయి విత్తనాలు అందించిన స్నేహితుడి కోసం గాలిస్తున్నారు.

11 మంది రామేశ్వరం జాలర్లను విడుదల చేసిన శ్రీలంక న్యాయస్థానం

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాకు చెందిన 11 మంది జాలర్లను విడుదల చేస్తూ శ్రీలంక న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. రామేశ్వరానికి చెందిన ఏడుగురు జాలర్లు గత నెల 13వ తేది నడుదీవు సమీపంలో చేపలు పడుతుండగా శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. అలాగే, గత నెల 29 తిరుపాలైకుడి గ్రామానికి చెందిన నలుగురు జాలర్లను కూడా లంక నావికాదళం అరెస్ట్ చేసి జైలుకు తరలించింది. జాలర్లకు విధించిన రిమాండ్ గడువు ముగియడంతో వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా, 11 మంది జాలర్లను విడుదల చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. విడుదలైన జాలర్లు ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్రానికి వస్తారని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

అలవెన్స్‌లు పెంచాలంటూ లోకో పైలెట్ల ధర్నా



నినాదాలు చేస్తున్న లోకో పైలెట్లు

ప్యారీస్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కిలోమీటర్ అలవెన్స్‌ను 25 శాతం పెంచాలని డిమాండ్ చేస్తూ సౌత్ డివిజన్ లోకో పైలెట్స్ బుధవారం సెంట్రల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. 2024 జనవరి 1 నుంచి కిలోమీటర్ అలవెన్స్‌ను 25శాతానికి పెంచాల్సివుందని, దీనికి ఐటీ మినహాయింపు ఇవ్వాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ లోకో పైలెట్లు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఇందులో ఆలిండియా లోకో పైలెట్ల సంఘం ప్రధాన కార్యదర్శి కేసీ జేమ్స్, సౌత్ జోన్ రైల్వే లోకో పైలెట్ల సంఘ అధ్యక్షుడు ఆర్.కుమరేశన్, ప్రిసీడియం కార్యదర్శి వి.బాలచంద్రన్ పాల్గొన్నారు. రైల్వేలో ఖాళీ అయిన పోస్టులను సకాలంలో భర్తీ చేయాలని, నైట్ డ్యూటీ చేసే తమకు డీఏ పెంచాలని కేంద్రప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో చెన్నై, మదురై, తిరుచ్చి, సేలం, త్రివేండ్రం రైల్వే డివిజన్లకు చెందిన సుమారు 200 మంది లోకో పైలెట్లు పాల్గొన్నారు.

మినీ బస్సులపై 'రెండాకులు' గుర్తు వ్యవహారం కేసు ఉపసంహరించుకున్న డీఎంకే

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి జయలలిత నేతృత్వంలో అన్నాడీఎంకే పాలనలో మినీ బస్సులపై రెండు ఆకుల గుర్తు పెయింట్ వేశారు. అలాగే, 'అమ్మ' తాగునీటి బాటిళ్లపై రెండు ఆకులు గుర్తు ముద్రించారు. ఈ క్రమంలో, మినీ బస్సులు, వాటర్ బాటిళ్లపై ముద్రించిన రెండు ఆకులు తొలగించాలని కోరుతూ 2013లో డీఎంకే తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది., ఈ కేసు మంగళవారం న్యాయమూర్తి దండపాణి విచారించగా, డీఎంకే తరఫున హాజరైన న్యాయవాది... ఈ కేసు ప్రస్తుతం చెల్లదు కాబట్టి పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. డీఎంకే వాదన అంగీకరించిన న్యాయమూర్తి, కేసు ఉపసంహరణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఈపీఎస్‌ను సీఎం అభ్యర్థిగా అంగీకరించం

● టీటీవీ దినకరన్

పెరంబూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా అంగీకరించే ప్రసక్తే లేదని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ మరోసారి స్పష్టం చేశారు. నగరంలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, చెంగల్పట్టు జిల్లాల నేతలతో దినకరన్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాజకీయాల్లో ఉంటే రాజకీయాలు మాత్రమే మాట్లాడిన అవసరం లేదన్నారు. స్నేహపూర్వకంగా అన్నామలైతో గంట సేపు సమావేశమై పలు విషయాలు చర్చించామని తెలిపారు. అన్నామలై రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మమ్మల్ని కూటమిలోకి ఆహ్వానించారన్నారు. ఆ సమయంలో ఢిల్లీ పెద్దలు తమను సంప్రదించలేదని, అన్నామలై ద్వారానే కూటమిలో చేరామన్నారు. కూటమి నుంచి వైదొలిగిన అనంతరం కూడా అన్నామలైను కలుస్తున్నానని తెలిపారు. ఎన్డీఏ కూటమిలో సీఎం అభ్యర్థిగా ఎడప్పాడి పళనిస్వామి పేరు కొనసాగే పక్షంలో, తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాల్సిన అవసరమే లేదని దినకరన్ స్పష్టం చేశారు.

పుదుచ్చేరి మాజీ సీఎం నిరాహారదీక్ష

పుదుచ్చేరి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి మాజీ సీఎం నారాయణస్వామి బుధవారం రాజ్‌భవన్ ప్రాంగణంలో నిరాహారదీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉరూలయన్‌పేట నియోజకవర్గంలో కొన్నిరోజుల క్రితం మురికినీరు కలిసి తాగునీటిని కొలాయిల ద్వారా సరఫరా చేశారని, ఈ నీటిని తాగిన ప్రజలు వాంతులు, విరోచనాలతో సుమారు 20 మంది ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారని, వీరిలో కొంతమంది మృతిచెందినట్లు తెలిసిందన్నారు. ప్రజా పనులశాఖ అధికారులు నిర్వహించిన పరిశోధనలో తాగునీటి కొలాయిల్లో ఏర్పడిన పగుళ్ల వల్ల మురికినీరు చేరినట్లు తెలిసింది. ప్రజల ఆరోగ్య పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం చూపడం సరికాదని, తాగునీటి పైపులో ఏర్పడిన లీకేజీ పూడ్చేలా తక్షణ చర్యలు చేపట్టాలని నారాయణస్వామి డిమాండ్ చేశారు.



'కంబి కడన్ కథై'లో ఓ దృశ్యం

దీపావళి రేస్‌లో
'కంబి కడన్ కథై'

దీపావళికి విడుదలయ్యే సినిమాల జాబితాలో 'కంబి కడన్ కథై' కూడా చేరింది. రాజనాథన్ పెరియస్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నట్టి, సింగంపులి, శామ్స్ తదితరులు నటించారు. మంగాత మూవీస్ సమర్పణలో ఉత్తరా ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రంతో పాటు మరికొన్ని చిత్రాలు కూడా దీపావళికి విడుదలకానున్నాయి. వీటిలో సముద్రఖని, గౌతం మేనన్ నటించిన 'కార్మేని సెల్వం', ధృవ్ విక్రమ్ - అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన 'బైసన్', ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్యూడ్', 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', హరీష్ కళ్యాణ్ నటించిన 'డీజల్' సినిమాలున్నాయి. ఈ దీపావళికి పెద్ద హీరోల చిత్రాలు విడుదల కాకపోవడంతో అనేక చిన్న చిత్రాలను విడుదల చేసేందుకు దర్శక నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు.

చిత్రజ్యోతి



'అంద 7 నాడ్గల్'లో శ్రీశ్వేత

రేబిస్ బాధితురాలిగా
హీరోయిన్ శ్రీ శ్వేత

ఎం.సుందర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'అంద 7 నాడ్గల్'. ఇందులో హీరోయిన్‌గా నటించిన శ్రీశ్వేత కుక్కకాటుకు గురైన పాత్రలో నటించారు. ఆమె సరసన అజిత్ తేజ్ హీరోగా నటించారు. ఈ సినిమాలోని తన పాత్ర గురించి శ్రీశ్వేత మాట్లాడుతూ, 'మంచి పాత్ర కోసం అన్వేషిస్తుండగా ఈ అవకాశం వచ్చింది. ఎలాంటి పాత్ర అని ఓ క్షణం కూడా ఆలోచన చేయలేదు. నాకు సినిమాల్లో నటించే అవకాశం వస్తే చాలని భావించాను. అందుకే కుక్క కాటుకు గురైన యువతి పాత్రలో నటించాను. రేబిస్ వ్యాధి సోకిన రోగులకు సంబంధించిన వీడియోలను చూసి అనేక విషయాలు నేర్చుకున్నాను. తెలుసుకున్నాను. ఈ సినిమాలో నా నటనను చూసిన అనేక మంది సినీప్రముఖులు శెభాష్ అంటూ మెచ్చుకుంటున్నారు. రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైనది. అయితే, వీధి కుక్కలు లేకుండా చేయాలని నేను చెప్పను. వాటి సంతానోత్పత్తి తగ్గించాలి. ఎందుకంటే నేను కూడా శునక ప్రేమికురాలినే. మా ఇంటిలో కూడా ఓ కుక్కను పెంచుతున్నాం' అన్నారు.

'ద్రౌపది-2' చిత్రీకరణ పూర్తి | డిసెంబరులో రిలీజ్

మోహన్.జి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ద్రౌపది-2' చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. నేతాజీ ప్రొడక్షన్స్, జీఎం ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ముంబైలోని వివిధ ప్రాంతాల్లో జరిగింది. చివరగా రాష్ట్రంలోని అరియలూరు జిల్లాలో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రం మొదటి భాగం ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. దీంతో మేకర్స్ రెండో భాగాన్ని తెరకెక్కించాయి. ఈ మూవీ విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'పక్కా ప్రణాళికతో దర్శకుడు చిత్రీకరణకు ప్లాన్ చేసినప్పటికీ నిర్మాత సహకారం లేకుంటే అనుకున్న ప్రకారం షూటింగ్ పూర్తి చేయలేం. ఈ విషయంలో చిత్ర నిర్మాత చోళ చక్రవర్తికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం. సినిమాపట్ల మక్కువ, మంచి సినిమాలు తీయాలన్న ఆసక్తి, సినిమా నిర్మాణ ప్రక్రియ ఆయన అర్థం చేసుకున్న తీరు కారణంగానే మాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. 14వ శతాబ్దంలో దక్షిణ భారతదేశ కథను గ్రాండ్ విజువల్స్‌తో తెరకెక్కించాం. నిర్మాణాంతర పనులు పూర్తి చేసి డిసెంబరులో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నా' అని పేర్కొన్నారు. ఇందులో రిచర్డ్ రిషితో పాటు ఇందునుధన్, నట్టి, వైజీ మహేంద్రన్, శరవణ సుబ్బయ్య, వేల రామమూర్తి, నానోడిగల్ భరణి తదితరులు నటించారు' అని పేర్కొన్నారు.



'ద్రౌపది-2' చిత్ర బృందం

చేపాక్ ప్యాలెస్‌కు
నూతన సొబగులు


257 యేళ్లనాటి కలశ మహల్‌కు పూర్వవైభవం



ఉడెన్ హాలు



ప్యాలెస్ గోడకు రంగు వేస్తున్న కార్మికుడు



ప్యాలెస్ ప్రధాన ద్వారం

టి.నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాబీచ్‌లోని ఎళిలగమ్ భవనానికి అనుబంధంగా ఉన్న 257 యేళ్లనాటి ప్రాచీన 'కలశమహల్' కొత్త అందాలను సంతరించుకుని పునఃప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ భవనాన్ని 'చేపాక్ ప్యాలెస్' అని కూడా పిలుస్తారు. 1768 నుండి 1855 వరకు ఆర్కాట్ నవాబు అధికారిక నివాసంగా ఉండే ఈ చారిత్రక భవనాన్ని ప్రజాపనుల శాఖ రూ.23 కోట్లతో ప్రాచీనతకు ఏ మాత్రం భంగం వాటిల్లని విధంగా, రెండున్నర శతాబ్దాల క్రితం ఆ భవననిర్మాణానికి ఉపయోగించిన ముడిసరకులు, సామగ్రితోనే పునర్నిర్మించింది. చేపాక్‌లో ఎళిలగమ్ కాంప్లెక్స్ రెండు బ్లాకులతో ఉంది. ఉత్తర దిశగా ఉన్న భవనాన్ని కలశమహల్ అని, దక్షిణదిశగా ఉన్న బ్లాక్ (భవనాన్ని)ని హుమయూన్ మహల్ అని పిలుస్తారు. హుమయూన్ మహల్ పైకప్పు (టెర్రస్)లో వెంటిలేషన్ పరికరాలు, కలశ మహల్‌కు అనుసంధానిస్తూ నడక మార్గం ఉన్నాయి. ఈ కలశ మహల్‌లో ప్రాచీనకాలం నాటి ధారు శిల్పాలు, విశాలమైన కొయ్య తోరణాలు, ఎరుపు రంగు ఇటుకతో సున్నపు రాతి గోడలున్నాయి. ఈ కళాత్మకమైన భవనాన్ని 1768లో ఇంజనీర్ పాల్ పెన్‌ఫీల్డ్ ఇండో - సార్సెనిక్ నిర్మాణ శైలిలో నిర్మించారు. కలశ మహల్ దిగువ అంతస్థులో ప్రభుత్వ కార్యాలయాలుండేవి. అయితే 2010లో హుమయూన్ మహల్ పైకప్పు కూలిపడింది. ఆ తరువాత 2012, జనవరి 16 అర్ధరాత్రి సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో కలశ మహల్ భవనంపై అంతస్థు ధ్వంసమైంది. ఈ రెండు అంతస్థులతోపాటు రెండు భవనాలను వాటి ప్రాచీనతకు ఎలాంటి మార్పులు చేయకుండా పునర్నిర్మించే పనులు చేపట్టారు. కలశమహల్ సమీపంలోని అనుబంధ భవనంలో ఓ ప్రభుత్వ కార్యాలయం పనిచేస్తుండేది. ఆ భవనం శిథిలస్థితికి చేరటంతో ఆ కార్యాలయాన్ని మరోచోటుకి తరలించారు. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం 2023 జూన్ 23న రూ.23.08 కోట్లతో మహల్ పునరుద్ధరణ పనులు ప్రారంభించింది. భవనాన్ని దాని పూర్వ స్థితికి ఏ మాత్రం భంగం కలుగని విధంగా గతంలో ఈ భవన నిర్మాణంలో ఉపయోగించిన సున్నం, బెల్లం, కోడిగుడ్లు, ఆవాలు, పెరుగు కలిపిన మిశ్రమంతో పూత పూశారు. ఆ భవనం మధ్యనున్న ఉడెన్ సెంట్రల్ హాలు (కొయ్యలతో తయారైన హాలు), కళాత్మకమైన బాల్కనీ పునరుద్ధరణపనులు చేపట్టారు. కొయ్య స్థూపాలు, మద్రాస్ రూఫ్ (పైకప్పు) ఇటుక కుడ్యాల పునరుద్ధరణ పనులు కూడా జరిపారు. ప్రస్తుతం కలసామహల్ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం ఈ మహల్ స్టార్‌హోటల్‌ను తలపిస్తోందని ప్రజాపనుల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. శతాబ్దానికి పైగా ఉపయోగించిన కలశ మహల్ అనుబంధ భవనం భారతదేశంలోనే ఇండో- సార్సెనిక్ శైలిలో నిర్మించిన మొట్టమొదటి భవనాల్లో ఒకటి అని చెప్పారు. ప్రస్తుతం కొత్త హంగులు సంతరించుకున్న ఈ కలశమహల్ గతంలా ప్రభుత్వ కార్యాలయాలతో కళకళలాడుతూ తన పూర్వ వైభవాన్ని ఎలుగెత్తి చాటనుందని అధికారులు తెలిపారు.





పై అంతస్థు చేరటానికి ఏర్పాటైన కొయ్య మెట్లు - స్థూపాల మండపం

ఫ్లై ఓవర్ సామగ్రి తయారు చేసే
గ్లోబల్ ఫ్యాక్టరీ సందర్శన



హైదరాబాద్‌లోని గ్లోబల్ ఫ్యాక్టరీలబీమ్‌ల తయారీని సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న మంత్రి ఈవీ వేలు

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నాసాలై నుండి సైదాపేట వరకు 3.20 కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్‌లో ఉపయోగించే ఉక్కు స్తంభాలు, బీమ్‌ల తయారీ పనులను రాష్ట్ర ప్రజలపనులు, హైవేస్ శాఖల మంత్రి ఈవీ వేలు హైదరాబాద్‌లోని గ్లోబల్ ఫ్యాక్టరీలో పరిశీలించారు. అన్నాసాలై నుండి సైదాపేట వరకు రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిశీలించే నిమిత్తం ఆ రెండు ప్రాంతాల నడుమ రూ.621 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మించనున్న విషయం విదితమే. ఆఫ్లైఓవర్ నిర్మాణ పనులకు అవసరమైన ఇనుప స్తంభాలు, బీమ్‌లను కొనుగోలు చేయడానికి మంత్రి ఈవీ వేలు బుధవారం ఉదయం గుజరాత్‌లోని వడోదరాలో ఉన్న ఓ కార్మాగారంలో ఇనుప స్తంభాలు, బీమ్‌ల తయారీ పనులను పరిశీలించారు. అక్కడి నుండి విమానంలో హైదరాబాద్ చేరుకున్న మంత్రి అక్కడి గ్లోబల్ ఫ్యాక్టరీని పరిశీలించారు. వడోదరా, హైదరాబాద్ ఫ్యాక్టరీల్లో ఇనుప బీమ్‌లు, స్తంభాలను తయారు చేసి వాటిని చెన్నై తరలించనున్నామని మంత్రి తెలిపారుల. మంత్రితోపాటు రహదారుల శాఖ కార్యదర్శి ఆర్ సెల్వంరాజ్, హైవేస్ చీఫ్ ఇంజనీర్ కేకే సత్య ప్రకాష్, సూపరింటెండింగ్ ఇంజనీర్ వి శరవణసెల్వం తదితరులు పర్యటించారు.

29న కాళికాంబాళ్ ఆలయంలో బెంగళూరు బాలికల సాంస్కృతిక ప్రదర్శన



చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్ కార్నర్ తంబుచెట్టి వీధిలోని కాళికాంబాళ్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బెంగళూరుకు చెందిన బాలికలు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు అధ్యక్షుడు ఈఎం మోహనాచ్చారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 సాయంత్రం లావణ్యా రూపకుల శిష్యురాలైన టీఎం సహానా కర్ణాటక గాత్రకచేరి, ప్రీతీ అరుణ్ శిష్యురాలైన టీఎం దేష్నా భరతనాట్య ప్రదర్శన ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాలు సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు కొనసాగుతాయని, చివరగా ప్రసాద వితరణ జరుగుతుందని ఆయన వివరించారు.

రవి మోహన్ ఇంటి జప్తునకు నోటీసు

అడయార్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో రవి మోహన్ ఇంటి జప్తునకు సంబంధించి ఒక బ్యాంకు నోటీసులు అంటించింది. ఇప్పటికే ఓ ఫైనాన్స్ కంపెనీ నుంచి రుణం తీసుకుని చెల్లించని కారణంగా ఆయన ఆస్తులను జప్తు చేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఓ ప్రైవేటు బ్యాంకు రవి మోహన్ ఇంటికి జప్తు నోటీసు అంటించింది. రవి మోహన్‌కు ఈసీఆర్‌లో బంగళా ఉంది. ఇక్కడ ఆయన భార్య ఆర్తి రవి, పిల్లలు ఉంటున్నారు. ఈ ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న రుణం వాయిదాలు చెల్లించలేదు. దీంతో గత నెల 24న జప్తు నోటీసు పంపించగా రవి మోహన్ స్వీకరించకుండా వెనక్కి పంపించారు. ఈ నేపథ్యంలో బ్యాంకు సిబ్బంది ఆ జప్తు నోటీసును ఇంటికి అంటించారు. కాగా, రవి మోహన్, ఆర్తి మోహన్ విడాకుల కేసు కోర్టులో సాగుతున్న విషయం తెల్సిందే.

గుండెపోటుతో సినీ దర్శకుడి మృతి

అడయార్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు ఆర్టీ నారాయణమూర్తి (59) గుండెపోటుతో కన్నుమూశారు. 2001లో ప్రభుదేవా, కౌసల్య, గాయత్రి జయరామ్, వడివేలు, వివేక్ నటించిన చిత్రం 'పనత్తై తిరుడి విట్టాయ్', 'ఒరు పొన్ను ఒరు పయ్యన్' చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. అనారోగ్యం కారణంగా ఓమందూర్ ప్రభుత్వాస్పత్రిలో కొద్దిరోజుల క్రితం చేరి చికిత్స పొందారు. మంగళవారం రాత్రి 8.30 గంటలకు గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కుమారుడు విదేశాల్లో ఉండగా, నగరానికి చేరుకోవడంలో ఆలస్యం జరుగుతుండడంతో, ప్రస్తుతం ఆయన మృతదేహాన్ని పమ్మల్‌లోని ఆయన స్వగృహంలో ఉంచారు. నారాయణమూర్తి అంత్యక్రియలు శుక్రవారంఉదయం జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు.



చెన్నైలో ఆరోగ్యశాఖ మాజీ మంత్రి డాక్టర్ హెచ్‌వీ హండేను ఆయన నడుపుతున్న ఆసుపత్రిలో బుధవారం కలుసుకున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి గురువారం చెన్నై నెహ్రూ స్టేడియంలో జరుగనున్న 'విద్యలో తమిళనాడు అగ్రస్థానం' వేడుకలకు ఆహ్వానిస్తున్న రాష్ట్ర మంత్రి టీఆర్బీ రాజా

ఆయుధపూజకు 180 టన్నుల స్వీట్లు : ఆవిన్

ప్యారీస్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఆయుధపూజ కోసం 180 టన్నుల స్వీట్లు తయారుచేస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వ నిర్వాహణలోని ఆవిన్ సంస్థ బుధవారం తెలిపింది. రాష్ట్రంలో ప్రతిఏటా ఆయుధ పూజ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రకరకాల స్వీట్లు, బహుమతులు అందజేయడం ఆనవాయితీ. ఆయుధపూజ కోసం ప్రైవేటు సంస్థలు ఈసారి కూడా కొత్తరకం స్వీట్లను మార్కెట్‌లో పరిచయం చేయనుంది. ఈ సంస్థలతో పోటీపడేలా ఆవిన్ కూడా స్వీట్ల నాణ్యత, రుచిపై ప్రత్యేక దృష్టిసారించింది. పిస్తా, నట్స్ హల్వా, నట్స్ బాదూషా, కాజూ కతిలీ తదితర స్వీట్ల అమ్మకాల్లో ముందంజలో ఉంది. ఈ సంవత్సరం కూడా ఈ స్వీట్ల ధరలను కిలో రూ.700ల నుండి రూ.1000గా నిర్ణయించింది. ఇవి కాకుండా కోవా స్వీట్, మైసూరుపా, మిల్క్‌కేక్, రసగుల్లా, గులాబ్‌జాం తదితరాలను కిలోకు రూ450 నుండి రూ.500ల వరకు ధర నిర్ణయించింది. నగరంలోని 35 ఆవిన్ పార్లర్లలో ఆయుధపూజ ప్రత్యేక స్వీట్ల కోసం ముందుగానే రిజర్వు చేసుకోవడంతో పాటు వెళ్లి కొనుగోలు చేయవచ్చు. పండుగను పురస్కరించుకుని గత ఏడాదిలో లాగే 30శాతం అదనంగా సుమారు 180 టన్నుల స్వీట్ల రకాలను తయారు చేస్తున్నట్లు ఆవిన్ సంస్థ అధికారులు తెలిపారు.

నేటినుంచి వీఐటీ వర్శిటీలో 'గ్రావిటాస్ మేధో ఉత్సవం'

వేలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ యూనివర్శిటీలో గురువారం నుంచి 'గ్రావిటాస్ మేధో ఉత్సవం' జరుగనుంది. ఈ కార్యక్రమానికి సుమారు 40వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. డ్రోన్ షో, రోబోల యుద్ధం సహా పలు విజ్ఞానాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలపై బుధవారం వర్శిటీ ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. తమ వర్శిటీ ఆధ్వర్యంలో 16వ వార్షిక 'గ్రావిటాస్ మేధో ఉత్సవం' గురువారం నుంచి 28వ తేది వరకు జరుగుతుందన్నారు. ఈ వేడుక విద్యార్థుల ఆవిష్కరణలు, సృజనాత్మకత ప్రదర్శనకు వేదికగా నిలుస్తుందన్నారు. గ్రావిటాస్ మేధో ఉత్సవంలో 207 కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఇదివరకే 60 కంటే ఎక్కువ కార్యక్రమాలు చేపట్టామన్నారు. మిగిలిన 147 ఈవెంట్లతో ఈ సంవత్సరం కొత్తగా 84 కొత్త ఈవెంట్లు జరుగనున్నాయని తెలిపారు. వీటిలో 51 హ్యాకథాన్‌లు, 57 శిక్షణ వర్క్‌షాప్‌లు, 24 సాంకేతిక పోటీలు, కార్టింగ్ అండ్ ఏరోక్రేటర్, క్వాడ్ కాప్టర్, కోడ్ 2 క్రియేట్ వంటి ప్రత్యేక కార్యక్రమా లుంటాయన్నారు. ఈ వేడుకల్లో మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల నుంచి 3వేలకు పైగా కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, 300కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 40వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నారని ఛాన్సలర్ విశ్వనాథన్ తెలిపారు.



మేథో ఉత్సవం వివరాలను ఆవిష్కరించిన ఛాన్సలర్ విశ్వనాథన్



సేవింతురే!

బ్రహ్మోత్సవాలకు నాంది పలికిన పల్లవరాణి సామవై



చిత్రం: సింగంపల్లి సత్యనారాయణ

తిరుమల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టింది పల్లవరాణి సామవై. క్రీ.శ.966లో ఆమె వెండితో రూపొందించిన భోగశ్రీనివాసమూర్తిని ఆలయంలో ప్రతిష్ఠించారు. మూల విగ్రహానికి సామ్యంగా అమరిన ఈ ఉత్సవమూర్తిని మనవాళ పెరుమాళ్ అనేవారు. వైభవోపేతంగా సాగిన ఆనాటి ప్రతిష్ఠాపన క్రతువే తిరుమల ఉత్సవాలకు నాంది అని అంటారు. ఏడాదికి రెండు బ్రహ్మోత్సవాలు జరిగేలా సామవై నిర్ణయించి జరిపించారు. 10వ శతాబ్దం దాకా ఏటా రెండు బ్రహ్మోత్సవాలు జరిగినట్టు ఆధారాలున్నాయి. తొమ్మిదిరోజుల వేడుకలు ఆమె ప్రారంభించినవే. 966 ఆగస్టు 27న మొదలైన ఈ వేడుకలే తొలి పురటాసి బ్రహ్మోత్సవాలు. ఉత్సవ మూర్తికి పల్లవరాణి అనేక ఆభరణాలను కూడా సమకూర్చారు. ఉత్సవాలకు రథాలు ఏర్పాటు చేశారు. శ్రీవారి మూలవిరాట్టు పాదాల చెంత పద్మపీఠానికి అనించి ఉంచిన భోగశ్రీనివాసుని భక్తులు దర్శించవచ్చు.



శ్రీవారి సేవలో ఉపరాష్ట్రపతి

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బుధవారం రాత్రి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకోగా సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. మహ ద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లిన ఆయన స్వామిని దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబుతో కలిసి వాహన మండపంలో పెద్దశేషవాహనంపై ఉత్సవమూర్తులను దర్శనం చేసుకున్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.2.85 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,837


తలనీలాలు సమర్పించినవారు: 20,904







శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో చంద్రబాబు కుటుంబీకులు.. సీఎంతో బోర్డు చైర్మన్, సభ్యులు, అధికారులు



నాడు : 1970ల నాటి ధ్వజారోహణం









బుధవారం రాత్రి పెద్దశేష వాహన సేవ ముందు కళా ప్రదర్శనలు



నేడు : బుధవారం జరిగిన ధ్వజారోహణం



ఊరేగిన ధ్వజపటం

ధ్వజారోహణంకి ముందు శుక్రవారం తిరుమల మాడవీధుల్లో ధ్వజపటం ఊరేగింపు వైభవంగా జరిగింది. గరుడకేతన ప్రతిష్ఠ, కంకణధారణ, ఆలయ ఆవరణంలో జరిగాయి. బయట అష్టదిక్కుల్లో అర్చకులు బలినివేస్తూ ఆలయం ముందుకు వచ్చారు. వారి వెనుకనే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి, అనంత, గరుడ, విష్వక్సేన, సుగ్రీవ, హనుమంతులను, ధ్వజపటాన్ని మాడవీధుల్లో ఊరేగిస్తూ సకలదేవతా మూర్తులకు ఆహ్వానం పలికారు. అనంతరం ఉత్సవ మూర్తులతో పాటు ధ్వజపటాన్ని ఆలయంలోకి తీసుకువెళ్లి ధ్వజారోహణం నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







ఫల, పుష్ప ప్రదర్శన శాల ప్రారంభం

తిరుమల, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ ఫల, పుష్ప, ఫొటో ప్రదర్శన. కల్యాణవేదిక వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను, రాంభగీచా-2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను బుధవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, శాంతారామ్, నరేష్‌కుమార్, జంగా కృష్ణమూర్తిలతో కలిసి పలు స్టాల్స్‌ను సందర్శించారు. ఏర్పాటు చేసిన వివిధ శాఖలను అభినందించారు. సీవీఎస్వో రవి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ రేణుదీక్షిత్, ఎస్వీ శిల్ప కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుష్ప ప్రదర్శన శాలలో 90 వేల మొక్కలు

వివిధ రంగుల్లో 18 రకాల జాతులను ప్రదర్శనకు ఉంచారు. కూరగాయలు, పండ్లు, పుష్పాలతో రూపొందించిన జంతువులు, పక్షుల బొమ్మలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. ఆనందనిలయ విమాన వేంకటేశ్వరుని మోసుకెళుతున్న మహాగరుడుడు సైకత శిల్పాన్ని బెంగుళూరుకు కళాకారిణి గౌరి రూపొందించారు. మూడు యుగాలకు సంబంధించిన 14 ఘట్టాలను కళ్లకుకట్టినట్టు చూపేలా ప్రతిమలను ఏర్పాటు చేశారు. మ్యూజిక్, డైలాగులు వినిపించడం వీటి ప్రత్యేకత. టీటీడీ గార్డెన్ విభాగం అధికారులు రూపొందించిన ఘటోత్కచ, బకాసుర, సురస, ద్రౌపతి స్వయంవరం వంటి పురాణ నేపథ్య పుష్ప అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయుర్వేద, అటవీశాఖల స్టాల్స్, శిల్పకళాశాలల స్టాల్స్ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. టీటీడీ పబ్లికేషన్స్ విభాగం అగరబత్తి స్టాల్‌ను ఏర్పాటు చేసింది.







ద్రౌపది స్వయంవరం



ఫలపుష్ప ప్రదర్శన శాలలో ఏర్పాటు చేసిన 'ద్రౌపది స్వయంవరం' సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా దర్శనమిస్తోంది. గతేడాది 'సీతా స్వయంవరం' స్థానంలోనే దీనిని ప్రస్తుతం ఏర్పాటు చేశారు. 20 రోజుల పాటు 20 మంది నిపుణులు 60 అడుగుల వెడల్పు, 39 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ సెట్టింగ్ కోసం కృషి చేశారు.



ఎగ్జిబిషన్ ప్రారంభించి పాత చిత్రాలు తిలకిస్తున్న బీఆర్ నాయుడు

పాత చిత్రాల విందు

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో తిరుమల, తిరుపతికి సంబంధించిన పాత ఫోటోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 1940 నుంచి భిన్న ప్రదేశాల్లో భిన్న సందర్భాల్లో తీసిన ఫోటోలు ఇందులో ఉన్నాయి. ఒకే ప్రదేశం నాడు-నేడు అంటూ ఏర్పాటు చేసిన ఫోటోలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

మూలస్థాన ఎల్లమ్మకు వెండి గజ వాహనం



వెండి గజ వాహనం

చంద్రగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మకు రూ.కోటి విలువైన వెండి గజ వాహనం వితరణగా అందింది. చంద్రగిరికి చెందిన జీఆర్ విజయరాఘవులు, బేబిరాణి, జీఆర్ చక్రపాణి, సత్యనాయణన్, హేమావతి వితరణగా అందించారు. దీని బరువు 75 కిలోలు. వినాయక స్వామి ఆలయంలో గజవాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొని వాహనాన్ని మోశారు. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, సింగిల్ విండో చైర్మన్ రాజులుగారి వినోద్‌రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, నాయకులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వెండి గజ వాహనాన్ని తీసుకువస్తున్న ఎమ్మెల్యే నాని, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

తిరుపతిలో తెలంగాణ యువకుడి హత్య

● రైలు పట్టాల పక్కన ఘాతుకం



సతీష్‌కుమార్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆర్గొండ గ్రామానికి చెందిన తమన్నగారి సతీష్‌కుమార్ (23) తిరుపతిలో బుధవారం మధ్యాహ్నం హత్యకు గురయ్యారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని రైలు పట్టాల పక్కన ఈ ఘాతుకం జరిగింది. తిరుపతి రైల్వే సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. ఆర్గొండ గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ ఒక్కడే కుమారుడు. ప్రైవేటు విద్యాసంస్థలో పీఈటీగా పనిచేస్తున్న ఇతడికి ఏడాది కిందట వివాహమైంది. గత ఆగస్టు నెలలో వివాహ వార్షికోత్సవం జరిగింది. తర్వాత ఆయన భార్య అలిగి వెళ్లిపోయింది. తర్వాత పీఈటీ ఉద్యోగాన్ని మానేసిన సతీష్‌కుమార్ ఖాళీగా ఉన్నారు. ఈనెల 22న కామారెడ్డి నుంచి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. ఆర్టీసీ బస్టాండు వద్దనున్న ఓ దుకాణంలో మద్యం తాగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో గానీ బుధవారం మధ్యాహ్నం దాదాపు 12.30 గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన, 91-40 విద్యుత్ స్తంభం వద్ద దుండగులు పగులకొట్టిన మద్యం సీసాతో ఇతడి గొంతు కోశారు. వారి నుంచి తప్పించుకున్న సతీష్ కొంత దూరం పరుగెత్తు కుంటూ వెళ్లి కింద పడి మృతి చెందినట్లు అక్కడి పరిస్థితులను బట్టి తెలుస్తోంది. పట్టాల పక్కన మృతదేహం ఉన్న విషయాన్ని కొందరు రైల్వే ప్రయాణికులు రైల్వే ఎస్‌ఐ రత్నమాలకు ఫోనుచేసి సమాచారమిచ్చారు. దీంతో రైల్వే సీఐ ఆశీర్వాదం, ఎస్‌ఐ ధర్మేంద్ర రాజు, తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ అధికారులు జయశ్రీ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రాజేష్‌గాంధీ, వేలిముద్ర నిపుణులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు ఉపయోగించిన మద్యం సీసా, పీఈటీగా పనిచేసిన ఐడీ కార్డు, ఆధార్, పాస్‌పోర్టు, రైలు టికెట్, సెక్యూరిటీ గార్డు పోస్టుకు సంబంధించి రెజ్యూమ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐడీ కార్డుల్లోని సెల్‌ఫోను నెంబర్ల ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. సాయంత్రం తిరుపతి రైల్వే ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ హత్యకు కారణం ఆయన గ్రామానికి సంబంధించి ఎవరితోనైనా ఆర్థిక లావాదేవీలా లేదా వివాహేతర సంబంధమా? లేకుంటే మద్యం మత్తులో స్థానికంగా ఘర్షణ పడటంతో హత్య చేశారా అనే కోణాల్లో రైల్వే సీఐ ఆశీర్వాదం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.

డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

మృతదేహం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు దగ్గర్లోని బార్ వద్దకు.. అక్కడ్నుంచి అంబేడ్కర్ విగ్రహం, మళ్లీ బస్టాండులోని వినాయక విగ్రహం వరకు పోలీస్ జాగిలం టైగర్ వెళ్లి ఆగిపోయింది. దీన్ని బట్టి హంతకులు హత్య చేశాక బస్సులో పారిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

స్విమ్స్‌లో 25 వేల గుండె చికిత్సలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రారంభించిన 32 ఏళ్లలో 25 వేల గుండె చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్‌లో 1993లో కార్డియాలజీ విభాగం స్థాపించగా, అదే ఏడాది క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మొదటి గుండె చికిత్సను 1994లో మొదలు పెట్టి ఇప్పటి వరకు 25 వేల గుండె చికిత్సలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. వీటిల్లో ఎన్టీఆర్ వైద్యసేవ, టీటీడీ ప్రాణదాన పథకాల కింద 85 శాతం పేదలకు ఉచిత చికిత్సలు అందించామన్నారు.

సైబర్ నేరగాళ్ల బురిడీ

● వృద్ధుడి ఖాతాలో రూ.1.58 లక్షలు హాంఫట్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సైబర్ కేటుగాళ్లు రోజుకో రూపంలో బురిడీ కొట్టిస్తున్నారు. తిరుపతికి చెందిన ఓ వృద్ధుడు తాజాగా వీరిలో వలలో చిక్కి రూ. 1.58 లక్షలు పోగొట్టుకున్నాడు. స్థానిక విజయనగర్ కాలనీకి చెందిన 65 ఏళ్ల వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి మూడు రోజుల క్రితం వాట్సాప్ కాల్ చేశాడు. ఇంట్లో ఉంటూనే చిన్న వ్యాపారం చేసుకుని సొమ్ము ఆర్జించవచ్చని నమ్మబలికాడు. తమ వాట్సాప్ నెంబరుకు హాయ్ అని పెడితే మిగిలిన వివరాలు పంపుతామన్నాడు. దీంతో బాధితుడు కుమార్తె ద్వారా హాయ్ అని పెట్టించాడు. వెంటనే సైబర్ మోసగాళ్లు మరో అడుగేసి బ్యాంకు ఖాతా,ఆధార్ వివరాలు పంపితే చిరు వ్యాపారానికి సంబంధించి పెట్టుబడి పంపుతామని బురిడీ కొట్టించాడు. సదరు వ్యక్తి వివరాలు పంపగానే బ్యాంకు ఖాతాలోని రూ.1.58 లక్షలు కాజేశారు. మొబైల్‌కు విత్‌డ్రా మెసేజ్ రావడంతో బాధితుడు లబోదిబోమంటూ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశారు.

బెడిసికొట్టిన అరెస్ట్ డ్రామా కాల్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కొడుకును అరెస్టు చేశామంటూ ఒక కళాకారుడికి టోపీ వేసేందుకు సైబర్‌నేరగాడు చేసిన విఫలయత్నమిది. ఎంఆర్‌పల్లికి చెందిన ఎమ్మాని వెంకటేశ్వర్లు అనే మ్యూజిక్ లెక్చరర్‌కు బుధవారం ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. ఎస్‌ఐ యూనిఫాంలో అతని డీపీ ఉంది. మీ హైదరాబాదులో ఉన్న కుమారుడ్ని ఒక కేసులో అరెస్ట్ చేశామన్నాడు. రూ.20వేలు ఫోన్‌పే ద్వారా పంపకపోతే బయటకు రాడంటూ బెదిరించాడు. అబ్బాయితో మాట్లాడించండని వెంకటేశ్వర్లు గట్టిగా గద్దించగా చిన్నబాబుది ఏడుపు స్వరం వినిపించాడు. తనకు హిందీ తెలియదని, ఇంగ్లిషులో మాట్లాడాలని వెంకటేశ్వర్లు రెట్టించేసరికి ఆ సైబర్ నేరగాడు డబ్బులు పంపుతారా లేదా అంటూ హెచ్చరించి ఫోన్ పెట్టేశారు. తన ఖాతాలో డబ్బులు లేకపోవడంతో నష్టం జరగలేదని వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతికి చెప్పారు.